సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 3, జూన్, 2024



సోమశిలలో 7.387 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 7.387 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 245 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,250
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,650
3 శాతం జీఎస్టీతో	రూ.6,850
నవర (8 గ్రా)	రూ.54,800



వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతిని పురస్కరించుకుని నెల్లూరులో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది. జై హనుమాన్, జై శ్రీరాం నామస్మరణతో మార్మోగింది. 10లో

న్యూస్‌రీల్

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



నేలటూరులోని ఏపీజెన్‌కో ప్రాజెక్ట్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మూడు యూనిట్లలో అవసరమైన మేరకు ఉత్పత్తి చేస్తున్నట్టు ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఈ మేరకు 1వ యూనిట్లో 540 మెగావాట్లు, 2వ యూనిట్లో 590 మెగావాట్లు, 3వ యూనిట్లో 770 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాల బంద్



వనంతోపులోని మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కలెక్టర్ ఎన్. హరినాయణన్ ఆదేశాల మేరకు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలను మూసివేయనున్నారు. ఈ నెల 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లకు ఎక్సైజ్ అధికారులు సీల్ వేయనున్నారు. 4వ తేదీ డ్రైడే పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. 5వ తేదీ యథావిధిగా దుకాణాలు, బార్లు తెరుచుకోనున్నాయి. అయితే ఈ నెల 3, 4, 5వ తేదీల్లో మద్యం దుకాణాలు, బార్‌లు మూసివేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. దీంతో ఆదివారం మందుబాబులు వందల సంఖ్యలో గంటల తరబడి క్యూలో నిల్చుని మద్యం కొనుగోలు చేశారు. మధ్యాహ్నంకే పలు దుకాణాల్లో మద్యం నిల్వలు అయిపోవడంతో సాయంత్రం వాటిని మూసివేశారు. ఈ నెల 4వ తేదీ డ్రైడే సందర్భంగా ఎవరైనా అనధికార విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

కౌంటింగ్‌కు పరిశీలకుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాకు సంబంధించి మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం పరిశీలకులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్ తెలిపారు. కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి నియోజకవర్గాలకు, నెల్లూరు పార్లమెంట్‌కు నితిన్‌సింగ్ బదారియా, కందుకూరు, నెల్లూరు రూరల్, నెల్లూరు పార్లమెంట్‌కు రామ్‌కుమార్‌గౌతమ్, కావలి, ఆత్మకూరు, నెల్లూరు పార్లమెంట్‌కు అభిలాష్‌కుమార్ టీజీ, సర్వేపల్లి నియోజకవర్గానికి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి జయేంద్రకుమార్ విజయవత్‌ను నియమించారు.

రెండో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



రెండో విడత ర్యాండమైజేషన్‌ను నిర్వహిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఆన్‌లైన్ పద్ధతిలో సిబ్బందిని కేటాయిస్తూ రెండో విడత కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను కలెక్టర్ ఎం.హరినారాయణన్ నిర్వహించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కౌంటింగ్ అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఆన్‌లైన్‌లో కౌంటింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో పూర్తి చేశారు. కౌంటింగ్ అబ్జర్వర్లు నితిన్‌సింగ్ బదారియా, జయేంద్రకుమార్ విజయవత్, అభిలాగ్‌కుమార్ టీజీ, రిటర్నింగ్ అధికారులు చిన్న ఓబులేసు, మలోల, శీనానాయక్, ప్రేమ్‌కుమార్, డీఆర్‌ఓ లవన్న, ఎస్‌బీసీ సమాచార అధికారి సురేష్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.


ఊపిరాడని ఉత్కంఠ

మరో 24 గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

24 గంటల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో రాజకీయ పార్టీల నేతలే కాకుండా అభ్యర్థులతో పాటు ప్రజలు నరాలు తెగే ఉత్కంఠ, ఊపిరి సలపని టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత నెల 13వ తేదీన పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్‌కు సుదీర్ఘ సమయం ఉండడంతో ఒకరిద్దరు మినహా మిగిలిన అభ్యర్థులు అందరూ విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి శనివారమే జిల్లాకు చేరుకున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో తమ ఏజెంట్లకు సూచనలు, సలహాలతో అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాకు సంబంధించి నెల్లూరు నగరంలోనే ఓట్ల లెక్కింపు జరుగుతుండడంతో ప్రధాన పార్టీల రాజకీయ నేతల సందడి పెరిగింది. హోటళ్లన్నీ హౌస్‌ఫుల్ అయిపోయాయి.

- రాజకీయ పార్టీల్లో హైటెన్షన్
- నగరానికి చేరుకున్న అభ్యర్థులు
- నెల్లూరు నగరంలో పోలీసు ఆంక్షలు కఠినం
- కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి





ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల ప్రవేశ ద్వారం వద్ద భద్రత దళాల పహారా

సాక్షి ప్రతినిధి,నెల్లూరు/ నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల రణరంగంలో ఆఖరి ఘట్టం కౌంటింగ్‌తో అభ్యర్థుల భవితవ్యం మరో 24 గంటల్లోనే తేలనుంది. ఒక పక్క చండ ప్రచండంగా కాస్తున్న ఎండల సెగలను మించి.. అభ్యర్థుల్లో హై ఫీవర్ మొదలైంది. సార్వత్రిక ఎన్నికల్లో విజేతలు ఎవరు, పరాజితులు ఎవరు, ఎవరెవరికి ఎంత మెజార్టీ వస్తుంది, బాగా మెజార్టీ వచ్చే మండలాలు, మెజార్టీ తగ్గే మండలాలు, యువత, మహిళలు, రైతులు ఎవరికి పట్టం కట్టారు.. ఇలాంటి అనేక ప్రశ్నలకు జూన్ 4వ తేదీ మధ్యాహ్నం 12 గంటల కల్లా పూర్తి స్పష్టత రానుంది. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల విశ్వసనీయ పాలన, టీడీపీ పద్నాలుగేళ్ల మోసాలు, విధ్వంస పాలనకు మధ్య జరిగిన ఎన్నికలుగా ప్రజలు భావించారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లూ సంక్షేమంతో పాటు సంపద సృష్టి, భవిష్యత్ తరాల అభివృద్ధి ప్రణాళికలతో పాలన సాగించింది. అవన్నీ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండడంతో పార్టీ క్యాడర్‌లో విశ్వాసం రెట్టించినట్లయింది. నేతలు సైతం ఉత్సాహంగా ఉన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 2014 ఎన్నికల్లో 74.02 శాతం పోలింగ్ జరిగితే.. 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. అప్పట్లో కోవూరు, ఉదయగిరి, వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ స్వల్ప ఓట్ల తేడాతోనే ఓటమిపాలైంది. అదే 2019 ఎన్నికల్లో 76.14 శాతం పోలింగ్ జరగడంతో 10 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుని అప్రతిహత విజయాన్ని కైవసం చేసుకుంది. తాజాగా జరిగిన 2024 ఎన్నికల్లో అయితే 80 శాతం పోలింగ్ జరిగింది. ఈ దఫా కూడా వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ నేతలు ధీమాగా ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం స్వీయ అంచనాలు వేసుకుని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చకాచకా ఏర్పాట్లు

నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని 8 నియోజకవర్గాలు, నెల్లూరు పార్లమెంట్ స్థానానికి కనుపర్తిపాడు సమీపంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహించి, రెండు స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. ఇక ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఒక్కొక్క రాజకీయ పార్టీకి 14 చొప్పున కౌంటింగ్ ఏజెంట్లు, రెండు పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్లు, ఒక ఆర్‌ఓ టేబుల్‌తో పాటు ఒక ఈటీపీఎస్ ఏజెంట్ మొత్తం 18 మందికి కౌంటింగ్ ఏజెంట్ పాసులను జారీ చేస్తున్నారు. దాదాపు ఈ ప్రక్రియ కూడా 90 శాతం పూర్తయింది.

బరిలో 115 మంది అభ్యర్థులు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పోటీ చేశారు. మొత్తం 171 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 41 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 15 మంది ఉపసంహరించుకోవడంతో 8 నియోజకవర్గాలకు సంబంధించి 115 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించి 21 మంది నామినేషన్లు దాఖలు చేయగా 6 తిరస్కరణకు గురికావడం, ఒక నామినేషన్ ఉపసంహరణ కావడంతో 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 15,48,183 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ల రూపంలో మరో 25,846 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వీసు ఓట్లు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు కలుపుకుని మరికొంత శాతం పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 3వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పర్యాయం వీవీ ప్యాట్ లెక్కింపు కారణంగా ఫలితాలు అధికారిక ప్రకటన రాత్రి 9 గంటలు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రాజకీయ పార్టీలు కూడా సన్నద్ధమవుతున్నాయి.

నెల్లూరు పార్లమెంట్ బరిలో 14 మంది	జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాల బరిలో 115 మంది
జిల్లాలో ఓటర్ల సంఖ్య: 20,53,397 మంది	పోలైన ఓట్లు: 15,48,183 మంది
పురుషులు: 7,63,894 మంది	మహిళలు: 7,84,219 మంది
ఇతరులు: 70 మంది	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు: 25,846 మంది

ప్రశాంత కౌంటింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి



తుది ఘట్టం ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహకరించి ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు సహకరించాలి. కౌంటింగ్ హాల్ వద్ద పటిష్ట మూడంచెల భద్రత నడుమ నిఘా కెమెరాలతో ఏర్పాటు చేశాం. కౌంటింగ్ కేంద్రం వద్ద అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్

హోటళ్లు హౌస్‌ఫుల్

విదేశీ పర్యటనలు, వ్యాపారాల్లో బిజీగా ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థులు దాదాపు అందరూ జిల్లాకు చేరుకున్నారు. సోమవారం సాయంత్రం నుంచి అభ్యర్థులు అందరూ నెల్లూరులో మకాం వేయనున్నారు. 8 నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ నగర శివార్లలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్నాయి. ఈ క్రమంలోని జిల్లాలోని సిటీ, రూరల్ మినహా మిగిలిన నియోజకవర్గాలకు చెందిన నేతలు, వారి అనుచరగణం ఇప్పటికే నగరంలో మకాం వేశారు. దీంతో నగరంలోని హోటళ్లు నిండిపోయాయి. సర్వీసు అపార్ట్‌మెంట్లు, గెస్ట్‌హౌస్‌లు కూడా పూర్తి బిజీగా మారిపోయాయి.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం



హాజరైన కౌంటింగ్ ఏజెంట్లు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

- నెల్లూరు పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలు గెలుస్తున్నాం
- నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు పార్లమెంట్ స్థానంతో పాటు జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలో రామ్మూర్తినగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కార్పొరేటర్లు, కౌంటింగ్ ఏజెంట్లతో కౌంటింగ్ రోజు అనుసరించాల్సిన విధివిధానాలపై పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులు, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్ అహ్మద్, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కొణిదెల సుధీర్, పార్టీ నాయకులు జూపూడి ప్రభాకర్‌రావు, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, మన్‌క్రాంత్‌రెడ్డి తదితరులతో కలిసి విజయసాయిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలని, వారికి దిశా నిర్దేశం చేశారు. పోస్టల్ బ్యాలెట్ దగ్గర నుంచి ఈవీఎం దగ్గర కౌంటింగ్ రోజున ఏదైనా సమస్య వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు అక్కడే ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రానుందని, అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. పార్లమెంట్ పరిధిలో ఎన్నికల రోజు చాలా బూత్‌లను పరిశీలించామని, ప్రజలు మన పార్టీ పట్ల అనుకూలంగా ఉన్నారని తెలిపారు. మన పార్టీ నూటికి నూరు శాతం గెలుస్తుందన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, గ్రామీణులు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారన్నారు. టీడీపీ, తదితర సంస్థలు నెల్లూరులో సిటీ, రూరల్, కోవూరు, టీడీపీ గెలవబోతుందన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ స్థానం, ఎనిమిది అసెంబ్లీ స్థానాలను గెలవబోతుందన్నారు. ప్రజాబలం మన పార్టీకే ఉందని, ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్టుగానే ప్రజలు మనకు ఓట్లు వేశారని తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన బూత్ ఏజెంట్లకు పార్టీ కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజాబలంతో వైఎస్సార్‌సీపీ ముందుకెళ్తే టీడీపీ డబ్బు కట్టలతో రాజకీయం చేసిందన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిన తర్వాత నుంచి పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలి


- ఎటువంటి గొడవలు, వాగ్వాదాలకు తావులేదు
- కౌంటింగ్ ప్రక్రియలో ఏ చిన్న సందేహం ఉన్నా వెంటనే పరిష్కరిస్తాం
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి సీఈసీ తాజా ఉత్తర్వుల మేరకు డిక్లరేషన్‌కు సంబంధించి తాజా ఉత్తర్వుల మేరకు డిక్లరేషన్ ఫారంలో గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, ఎటువంటి సీలు లేకపోయినా ఓటు చెల్లుతుందని చెప్పారు. ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల క్యూఆర్ కోడ్ స్కానింగ్ సమయంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే ఎలా పరిష్కరించాలో కూడా సీఈసీ తెలిపిందని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో ఎటువంటి గొడవలు, వాగ్వాదాలకు తావులేదని, ఏ చిన్న సందేహం ఉన్నా వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ చెప్పారు. జూన్ 4న ఉదయం 6 గంటలకే అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ హాల్‌కు చేరుకోవాలని, మీ సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల సీళ్లు ఓపెన్ చేస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ కేంద్రంలోనే తాగునీరు, గ్లూకోజ్ వాటర్, అల్పాహారం, టీ, స్నాక్స్, భోజనం సౌకర్యాలు కల్పించినట్లు కలెక్టర్ చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం గేటు బయట ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ డిపాజిట్ కేంద్రంలో తమ ఫోన్లను డిపాజిట్ చేయాలని, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు మాత్రం కౌంటింగ్ కేంద్రం లోపల ఆవరణలో ఏర్పాటు చేసిన పబ్లిక్ రిప్రజెంటేటివ్ గదిలో తమ ఫోన్లను వినియోగించుకోవచ్చునని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలకు కౌంటింగ్ కేంద్రం సమీపంలో ఉన్న జెడ్పీ హైస్కూల్ వరకే అనుమతి ఉంటుందని, అక్కడి నుంచి కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ల వాహనాలకు మాత్రం కౌంటింగ్ కేంద్రం గేటు బయట 100 మీటర్ల వరకు అనుమతి ఉంటుందని, అక్కడ వదిలి పెట్టిన వెంటనే తిరిగి జెడ్పీ హైస్కూల్‌లో పార్కింగ్ ప్రదేశాలకు వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, టీడీపీ నుంచి రూప్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నుంచి సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

- ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైమ్): ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు, ఫలితాలు వెల్లడి అనంతరం ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ కోరారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం ఆయన నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు వ్యవహరించాల్సిన తీరు, ఎన్నికల నిబంధనలను వారికి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ రోజు నుంచి ఎగ్జిట్ పోల్స్ వెలువడినంత వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించడం చాలా సంతోషమన్నారు. కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను 'నో ఫ్లై జోన్‌గా' ప్రకటించామని, మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్ర పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం ప్రవేశం ద్వారా వద్ద విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది కౌంటింగ్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. సంబంధిత అధికారులు జారీ చేసిన పాస్‌లతో పాటుగా గుర్తింపు కార్డులను ఏజెంట్లు తమ వెంట తీసుకెళ్లాలన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు లోనికి నిషేధమన్నారు. వాటిని కౌంటింగ్ కేంద్రం బయట ఉన్న కౌంటర్‌లో డిపాజిట్ చేయాలన్నారు. ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్తే కౌంటింగ్ పూర్తయ్యే వరకు బయటకు వెళ్లేందుకు వీలులేదని, ఏదైనా అనారోగ్య సమస్యలుంటే ముందుగానే అందుకు సంబంధించిన మందులను వెంట తెచ్చుకోవాలన్నారు. అన్నీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే వాహనాలను పార్క్ చేయాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రజా తీర్పు ఎలా ఉన్నా ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని, దీనిని వ్యతిరేకించి అల్లర్లకు దిగితే సహించేదిలేదన్నారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉందని, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచాలు కాల్చడం నిషేధమన్నారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా సందేశాలు, చిత్రాలు వంటివి పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భద్రతా పరంగా ఎలాంటి సమస్యలున్నా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర, రూరల్, ట్రెయినీ డీఎస్పీలు డి. శ్రీనివాసరెడ్డి, పి. వీరాంజనేయరెడ్డి, హేమలత, ఎస్‌బీ, నెల్లూరు నగర ఇన్‌స్పెక్టర్లు కె. రామకృష్ణారెడ్డి, బి.అశోక్‌కుమార్, ఎం బాబీ, ఏ సుబ్బరాజు, పీవీ నారాయణ, అల్తాఫ్ హుస్సేన్, ఎల్ వీరానాయక్, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీకే అనుకూలం



మాట్లాడుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి

- మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి పలు సర్వే సంస్థలు నిర్వహించిన సర్వేల్లో రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారం చేపట్టనున్నట్లు తేల్చి చెప్పాయని నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం సాయంత్రం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. దేశంలో ఎన్నికలు పూర్తయిన అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శనివారం రాత్రి పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయన్నారు. వాటిలో అత్యధిక శాతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడనుందని ఘంటాపథంగా చెప్పాయన్నారు. మంగళవారం నిర్వహించే కౌంటింగ్‌లో ఎగ్జిట్ పోల్స్‌ను మించి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రదాత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మహిళలు ముక్తకంఠంతో జేజేలు పలుకుతూ ఓట్ల రూపంలో తమ కృతజ్ఞతలు చూపారన్నారు. పలు పార్టీలు కూటమిలా ఏర్పడి ఒక్కడిగా అభిమన్యుడిలా పోరాడే జగన్‌తో ఢీకొన్నా.. వారికి ఆశాభంగం తప్పట్లేదన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలు తమ కుటుంబాన్ని పెద్ద మనస్సుతో ఆశీర్వదించినట్లు మరోసారి రుజువు కానుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మేకపాటి అభినవ్ రెడ్డి, ఎం లక్ష్మీరెడ్డి, తదితరులు ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు


ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అనంతరం అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి స్థానిక పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని భావోద్వేగాలకు లోనై అల్లర్లకు దిగి పోలీసు కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రశాంత కౌంటింగ్‌కు పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కౌంటింగ్‌కు రెడీ

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ మంగళవారం జరుగుతుంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కనపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను ముమ్మరంగా చేయిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య పనులు చేయించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది


కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించే ముందు వివరాలు నమోదు చేస్తున్న పోలీస్


అధికారులకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు


కేంద్రం వద్ద పని చేస్తున్న కార్మికులు


కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు


వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశం

ఆ పిల్లలకు అండగా..

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి కోసం భవిత కేంద్రాలను నిర్వహిస్తోంది. సమగ్ర శిక్ష ద్వారా వివిధ పథకాలను అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా కొత్త వారిని గుర్తించేందుకు ఐఈఆర్‌టీలు సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా పాల్గొంటున్నారు.

- ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు భవిత కేంద్రాలతో భరోసా
- కొత్తవారి గుర్తింపునకు సర్వే
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు
- జిల్లాలో ఇప్పటికి 507 మంది గుర్తింపు


నెల్లూరు భవిత కేంద్రంలో ఆడుకుంటున్న ప్రత్యేక అవసరాలున్న పిల్లలు (ఫైల్)

వరికుంటపాడు: ప్రత్యేక అవసరాలున్న పిల్లలు.. వీరికి బంగారు భవిష్యత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. వారిని సమగ్ర శిక్ష ద్వారా గుర్తించి చదువు నేర్పిస్తోంది. ప్రతివారం ఫిజియోథెరపీ చేయించి వారికి అవసరమైన పరికరాలను అందిస్తోంది. ఈ ఏడాది ఇలాంటి పిల్లలను ఎక్కడైనా ఉంటే గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పేందుకు ఐఈఆర్‌టీలు చర్యలు తీసుకుంటున్నారు. గతనెల ఒకటి తేదీన సర్వే ప్రారంభించారు. ఇది ఈనెల 9వ తేదీన ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా శనివారం నాటికి 507 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించారు.


సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్టీ

పిల్లలకు ప్రత్యేక అలవెన్సులు

ఈ విద్యాసంవత్సరంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాల్లో ప్రవేశం కల్పించడానికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. ఐఈఆర్టీలు సర్వే చేసి 21 రకాల వైకల్యాలు గల వారిని గుర్తించి వివరాలను మండల విద్యాశాఖ అధికారి ధ్రువీకరణతో సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపిస్తారు. అలాగే భవిత సెంటర్‌కు వచ్చే పిల్లలకు రవాణా అలవెన్స్, బాలికలకు స్టైఫండ్, నడవలేని వారికి ఎస్కార్ట్ అలవెన్స్, అవసరమైన దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేయడం చేస్తారు. మంచానికే పరిమితమైన వారికి ప్రతి శనివారం ఇంటి వద్దనే విద్య అందించడం జరుగుతుంది. వీరికి హోం బేస్ అలవెన్సు చెల్లిస్తారు. అలాగే ప్రభుత్వం ద్వారా రాయితీలు అందజేస్తారు. హోం బేస్డ్ అలవెన్సు కింద నెలకు రూ.300, బాలికల స్టైఫండ్ అలవెన్సు కింద నెలకు రూ.200, రీడర్ అలవెన్సు రూ.200, భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు ట్రాన్స్‌పోర్టు అలవెన్సు రూ.300, నడవలేని వారికి ఎస్కార్ట్ అలవెన్స్ నెలకు రూ.300 వంతున ఇస్తారు. ఇంకా ప్రభుత్వ పథకాలైన అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సదరన్ క్యాంపుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన పరికరాలను అందజేస్తారు. ఈ పరీక్షలు ఆర్థో, వినికిడి లోపం తదితర విభాగాల్లో చేస్తారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 38 భవితా కేంద్రాలున్నాయి. వీటిలో 608 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలున్నారు. ఇంకా ప్రైవేట్, మోడల్ పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ తదితర వాటిల్లో 3,088 మంది ఆ తరహా విద్యార్థులు చదువుకుంటున్నారు. తాజాగా సర్వేలో మరో 507 మందిని గుర్తించారు. భవిత కేంద్రాల్లో జిల్లా వ్యాప్తంగా 74 మంది ఐఈఆర్‌టీ, 26 మంది ప్రత్యేక బోధకులు, 36 మంది కేర్ గివింగ్ వలంటీర్లు, 9 మంది ఫిజియోథెరపిస్టులు పనిచేస్తున్నారు.

సర్వే నూరు శాతం పూర్తి చేసేలా చర్యలు

జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. దీనిని పక్కాగా నూరుశాతం పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 507 మందిని గుర్తించాం. ఈ పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి భవిత కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలకు అలవెన్సులు సకాలంలో అందిస్తున్నాం. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాలు అందిస్తున్నాం. భవిత కేంద్రాల్లో అర్హులైన ఐఈఆర్టీలు పనిచేస్తున్నారు. ఒక్కో కేంద్రానికి ఇద్దరు వంతున ఉన్నారు.

– సీహెచ్ ఉషారాణి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారిణి, నెల్లూరు

సహకరించాలి

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నాం. భవిత కేంద్రాల్లో పనిచేసే ఐఈఆర్టీలు ఇంటింటికీ వెళ్లి వారిని గుర్తించే పనిలో నిమగ్నమై ఉన్నారు. తల్లిదండ్రులు సహకరించి వివరాలు అందించాలి.

– పెంచలయ్య, సమగ్ర శిక్ష సీఎంఓ, నెల్లూరు

శ్రీవారి సేవలో మేకపాటి విక్రమ్‌రెడ్డి


పెంచలకోనలో విక్రమ్‌రెడ్డి తదితరులు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, ఆంజనేయస్వామిని వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారు మండలంలోని పోతుకొండ అంకమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, లీలామోహన్‌రెడ్డి, నారసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



రాపూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులకు వస్తున్న విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారిణి ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల వలన విద్యార్థుల్లో పఠనాశక్తి, సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. విద్యార్థులు లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ.75
నన్నవి: రూ.35
పండ్లు: రూ.25



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 161
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 284
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 314
లేయర్ చికెన్	: 204



తుది ఘట్టానికి సర్వం సిద్ధం

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశాం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్


ఏర్పాట్ల గురించి ఆరా తీస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రణాళికాబద్ధంగా జరపడానికి చర్యలు తీసుకున్నాం' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల వద్ద స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ హాల్స్, మీడియా సెంటర్లలో చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. లెక్కింపు కోసం 1,110 మంది, వారితో కలిపి పోలీస్, హెల్పర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం సుమారు 3 వేల మందిని వినియోగిస్తున్నామన్నారు. కౌంటింగ్ 17 హాళ్లలో జరుగుతుందని, ఒక్కో హాల్లో 14 టేబుళ్లు ఉంటాయని ఆయన తెలిపారు. ఇక్కడికి వచ్చే వారి కోసం కళాశాల ఆవరణలో తాగునీరు, అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఏజెంట్లు, సిబ్బందికి జిల్లా పరిషత్ హైస్కూల్లో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్ మొబైల్ ఫోన్లను పబ్లిక్ రిప్రజెంటేటివ్స్ గది వరకు, మీడియా వారి ఫోన్లను మీడియా సెంటర్ వరకు అనుమతిస్తారన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు తమ ఫోన్లను కళాశాల గేటు బయట ఏర్పాటు చేసిన డిపాజిట్ కేంద్రంలో భద్రపరుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలను పాటించాలని, కౌంటింగ్ సజావుగా సాగడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. 130 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ పార్టీలు గ్రామాల్లో తిరుగుతున్నాయన్నారు. ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. 3 నుంచి 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో ఏమైనా సమస్యలు ఎదురైతే ఆర్‌ఓ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ నేతృత్వంలో పోలీస్ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉందని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎస్‌డీసీ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): వడదెబ్బకు లోనై లేక మరే ఇతర కారణమో తెలియదు కానీ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి నెల్లూరులోని గుప్తా పార్కు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు సంతపేట ఇన్‌స్పెక్టర్ ఎ.సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు 94407 00097, సంతపేట పోలీసులకు తెలియజేయాలని ఆదివారం కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని సోమలరేగడ గ్రామంలో తాళం వేసిన ఓ నివాసంలో నిల్వ ఉంచిన మహారాష్ట్ర, గోవా, మన రాష్ట్రానికి చెందిన 99 మద్యం బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక సెబ్ సిబ్బంది సదరు ఇంటికి వెళ్లారు. తాళం వేసి ఉండడంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో పగులగొట్టి చేసి ఇంటిని తనిఖీ చేశారు. మన రాష్ట్రానికి చెందిన 46, గోవాకు చెందిన 48, మహారాష్ట్రకు చెందిన 5 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఉదయగిరి సెబ్ సీఐ వెంకటరమణమ్మ, టాస్క్‌ఫోర్స్ ఎస్సై మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టారు. కార్యక్రమాల్లో ఈఓ నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్వీ సంగీత కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర డోలు పాఠశాలలో 2024 – 25 విద్యా సంవత్సరానికి గానూ పలు రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో గాత్రం, వయోలిన్, వీణ, ఫ్లూట్, నాదస్వరం, భరతనాట్యం, హరికథ, మృదంగం, డోలు, ఘటం వంటి విభాగాల్లో కోర్సులు ఉన్నాయి. ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుంది. ఆసక్తి గల వారు కళాశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. ఇతర వివరాలకు 0877–2264597, 73308 11173, 94407 93205 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

11 నుంచి పీజీ కళాశాలల పునఃప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలలు ఈనెల 11వ తేదీ నుంచి పునఃప్రారంభమవుతాయని రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈనెల 10వ తేదీన తరగతులు మొదలవుతాయని వెల్లడించారు. విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని సూచించారు.